


# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 143 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల బుధవారం 28 జనవరి 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE 143 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA WED 28 JANUARY 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

## నేతలకు చంద్రబాబు వార్నింగ్



- పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు.. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్న చంద్రబాబు
- పదవులు పొందిన నేతల పనితీరుపై ప్రతి 3 నెలలకోసారి సమీక్ష
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం
- అధికారాన్ని నిలబెట్టుకోవడం అందరి బాధ్యత అని నేతలకు సూచన
- గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తీవ్ర విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:** పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు

- మిగతా 2లో...



## టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో కూర్చున్న చంద్రబాబు

- టీడీపీ పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- నాయకులతో కలిసి కూర్చుని శిక్షణ పొందిన అధినేత
- కార్యకర్తే పార్టీకి అధినేత అని మరోసారి చాటిచెప్పిన వైనం
- పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలపై 1050 మందికి శిక్షణ
- చంద్రబాబు నిరాడంబరత స్ఫూర్తిదాయకమన్న నేతలు, కార్యకర్తలు

- మిగతా 2లో...

## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ... షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్



- ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం
- షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ
- వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం

- మిగతా 2లో...



## ఢిల్లీలో చారిత్రక ఘట్టం..

### భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

- భారత్, యూరప్ సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు
- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

- మిగతా 2లో...



## మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

- అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాలన్న మంత్రి టిమ్ హాడ్గ్‌సన్
- ముడిచమురు, సహజ వాయువుల రవాణాకు కెనడా సిద్ధంగా ఉందన్న ఆ దేశ మంత్రి

- మిగతా 2లో...



# ముగిసిన హల్వా వేడుక...

## బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!

- కేంద్ర బడ్జెట్ 2026–27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

- మిగతా 2లో...

కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన,

## దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె... స్తంభించిన సేవలు




- వారానికి 5 రోజుల పనిదినాల కోసం దేశవ్యాప్త సమ్మె
- ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్
- యూఎఫ్‌బీయూ పిలుపుతో నిరసన బాట పట్టిన ఉద్యోగులు

- మిగతా 2లో...


## జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

- ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతున్నందుకు జోగి రమేశ్ ను జైల్లో పెట్టారన్న కేతిరెడ్డి
- ప్రభుత్వ తప్పిదాలపై రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారని వ్యాఖ్య
- తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శ



మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రామును తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈరోజు ఆయన జోగి రమేశ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతున్నందుకు 83 రోజులు జైల్లో పెట్టారని, చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత తప్పుడు కేసులు పెట్టి అందరినీ ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు.

- మిగతా 2లో...



## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

### టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం

- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

- మిగతా 2లో...



## పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

- ప్రపంచ మార్కెట్లో బలహీనపడుతున్న అమెరికా డాలర్
- డాలర్‌తో పోలిస్తే రూ.90 వద్ద స్థిరంగా భారత రూపాయి
- భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగే అవకాశం
- అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో డాలర్‌పై ఒత్తిడి

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభంలో భారతం

భారత దేశం నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నిశ్చల జీవనశైలి, జన్యుశాస్త్ర కారణాలతో పాటు మనం తీసుకునే ఆహార పదార్థాల వల్ల 'ఇన్సులిన్ నిరోధకత(ఇన్సులిన్ రెసిస్టెన్స్), జీవక్రియ సిండ్రోమ్ (మెటబాలిక్ సిండ్రోమ్) లక్షణాలు కనిపిస్తాయి. మన సాధారణ ఆహారంలో అధికంగా రొట్టెలు, బియ్యపు అన్నం తినడం, బంగాళాదుంపలు తీసుకోవడం, సమోసాలు/బజ్జీలు/బిస్కెట్లు నమలడం, చక్కెరలతో కూడిన శీతల పానీయాలు తాగడం, మైదా పదార్థాలు తీసుకోవడం, బర్గర్ ఫిజ్జాలు ఇష్టపడడం, స్నాక్స్ నమలడం, స్వీట్లు తినడం లాంటివి తీసుకోవడంతో భారతీయులకు జీవక్రియ సంబంధ అనారోగ్యాలు అధికంగా బయట పడుతున్నాయి. దీని ఫలితంగా భారతదేశం "మధుమేహ కేంద్రంగా భారత్" లేదా "డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్"గా కీర్తించబడుతున్నది. శరీర కణాలు క్లోమం ఉత్పత్తి చేసే ఇన్సులిన్ హార్మోన్‌కు తక్కువ స్పందన చూపినపుడు ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. కండరాలు, కాలేయం, కొవ్వు లాంటి శరీర కణజాలాలు ఇన్సులిన్‌కు స్పందించనపుడు, రక్తంలో కణాల్లోకి సులభంగా గ్లూకోజ్ చేరడం జరుగదు. దీని వల్ల క్లోమ గ్రంథి (ప్యాంక్రియాస్) అదనంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ చివరకు ఆ హార్మోన్ సరిపోక రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగి టైప్ – 2 మధుమేహం బయట పడుతుంది. ఇలాంటి అవాంఛనీయ పరిస్థితిని "ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)" అని, ఇది ఒక ప్రమాదకర జీవక్రియ రుగ్మతగా మారుతుంది. దీనినే "జీవక్రియ ఆరోగ్య సంక్షోభం (మెటబోలిక్ హెల్త్ క్రయసిస్)" అని పిలుస్తున్నాం. ఈ రుగ్మత వల్ల నిద్రలేమి, అలసట, బలహీనత, అధిక దాహం, , ఏకాగ్రత లోపం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. ఈ విధమైన జీవక్రియ సంక్షోభం ఫలితంగా డయాబెటిస్‌తో పాటు ఊబకాయం (ఒబేసిటీ), గుండె జబ్బులు, స్త్రీలో హార్మోన్ల అసమతుల్యత, కాలేయ వ్యాధి (నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్) లాంటి ప్రాణాంతక అనారోగ్యాలు కలుగుతాయి. అధిక బరువు ఉండడం, కాలేయం/బొడ్డు కొవ్వు పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం, నిష్క్రియాత్మక జీవన శైలి అలవడడం, అధిక మానసిక ఒత్తిడి గుప్పిట్లో చిక్కడం లాంటి కారణాల వల్ల జీవక్రియ ఆరోగ్య సంక్షోభానికి లేదా ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది. ఇన్సులిన్ నిరోధకత నివారణకు ప్యాకెట్ ప్రాసెస్డ్ ఫుడ్స్, నిలువ ఉంచిన ఆహారం, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, కృత్రిమ చక్కెరలు, తీపి పాల ఉత్పత్తులు, రుచి కలిగిన పెరుగు, వేపుడు ఆహారం, చక్కెర పానీయాలకు దూరంగా చక్కటి ఆరోగ్యకర ఆహార అలవాట్లను పాటించాలి. ప్రతి రోజు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి. శరీర బరువును తగ్గించుకోవడం, మానసిక ఒత్తిడికి ఆస్కారం ఇవ్వకపోవడం, నిద్రకు తగిన సమయం కేటాయించడం లాంటి జీవనశైలి మార్పులను పాటించాలి. ఆకు కూరలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు, కొవ్వు చేపలు, తగినంత ప్రోటీన్ ఆహారం, దాల్చిన చెక్క, సుగంధ ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. డిజిటల్ యుగపు యువత అసాధారణ జీవనశైలి, అవాంఛనీయ ఆహారపు అలవాట్లతో క్రమంగా జీవక్రియ ఆహార సంక్షోభం వైపు పయనిస్తున్నారు. దీని వల్ల తిరిగి కోలుకోలేని టైప్–2 మధుమేహం బారిన పడడం జరుగుతున్నది. ఈ విషయాల గంభీరతను దృష్టిలో పెట్టుకొని తమ తమ జీవనశైలిల్లో సకారాత్మక మార్పులు చేసుకుంటూ డయాబెటిస్‌కు దూరంగా ఆరోగ్యకర జీవితాలను అనుభవిద్దాం. జీవక్రియ సిండ్రోమ్ లేదా సంక్షోభానికి చరమ గీతం పాడుదాం.

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

- మొదటి పేజి తరువాయి

చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. "ప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.

**కార్యకర్తే అధినేత.. వారికి అండగా ఉండాలి**

పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. "ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలి" అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. "మనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

### ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ

# 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు.

ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన, సహజ వనరుల మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా ఎదుగతోందని, ఈ నేపథ్యంలో ఇంధన రంగంలో కెనడా అగ్రగామిగా నిలవాలంటే భారత్‌తో వ్యాపారం చేయడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో జరుగుతున్న భారత ఇంధన వారోత్సవాలకు కెనడా మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు దేశాల ఇంధన సహకారానికి ఈ వారోత్సవాలు ఒక మంచి వేదికని అన్నారు. భారత్, కెనడా మధ్య వాణిజ్య సంబంధాలను, ఇంధన వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడానికి ఒట్టావా నుంచి భారత్‌కు ముడిచమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అంతకుముందు టిమ్ హాడ్గ్‌సన్ 'ఎక్స్' వేదికగా తన భారత పర్యటన గురించి స్పందిస్తూ, భారత్‌లో జరుగుతున్న ఇంధన వారోత్సవాల్లో పాల్గొనడం తన తొలి పర్యటన అని పేర్కొన్నారు. కాగా, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించే దిశగా భారత్, కెనడా అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. కెనడా వాణిజ్య మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో భారత్ వాటా 30 శాతం నుంచి 35 శాతానికి పెరుగుతుందని అంచనా వేయగా, తద్వారా భారత్ మూడవ అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా అవతరిస్తుందని ఆయన అన్నారు.

# ముగిసిన హల్వా వేడుక...

- మొదటి పేజి తరువాయి

రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు**

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'

ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, ఱఅఎఱుఎబఒస్త్రవ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

"జోగి రమేశ్ ను కలిసేందుకు ఆసుపత్రికి వెళ్లిన కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా ఉందో అంతా చూస్తున్నారు. మర్డర్లు చేసిన వారిపై కేసు పెట్టడం లేదు. కోడిని, గొర్రెలను కోసిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమంగా జైళ్లకు పంపిస్తే రెట్టించిన ఉత్సాహంతో మావాళ్లు పనిచేస్తారు. కూటమి ప్రభుత్వం తప్పిదాలపై జోగి రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారు" అని కేతిరెడ్డి అన్నారు. "ధర్మవరంలో 70 శాతం కల్తీ మద్యం దొరుకుతోంది. కల్తీ మద్యం తయారు చేసేది నీ జిల్లా నుంచే చంద్రబాబు. బెల్టుషాపులు లేకుండా చేస్తానన్నావ్. కానీ ఇప్పుడు ఊరికి నాలుగు బెల్టు షాపులు ఉన్నాయి. వేలంపాటలో బెల్ట్ షాపులు పాడుకుంటున్నారు. గిట్టుబాటు కావడం కోసం కల్తీ మద్యం అమ్ముతున్నారు. కొన్ని రోజుల క్రితం కడప జిల్లాలో ఇద్దరు చనిపోయారు. మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నాడు. చంద్రబాబుపై ఉన్న కేసులను మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అని ఎలా తొలగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. "చట్టం అందరికీ ఒకటే. కేసులు తీసేయించుకోవాలని చూస్తున్న ప్రయత్నంపై అప్పీల్‌కు వెళతాం. మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ మేం అధికారంలో ఉన్నప్పుడే తెచ్చాం. మంచి మద్యం ఇస్తానని చంద్రబాబు చెబితే అందరూ ఈలలు వేశారు. మంచి విద్య, వైద్యం ఇస్తామని జగన్ చెప్పితే ఎవరూ చప్పట్లు కొట్టలేదు. నేను ఇది చేశానని చెప్పి గడప గడపకు వెళ్లాలంటే ధైర్యం కావాలి. జగన్ ఎమ్మెల్యేలందరినీ ప్రజల ఇళ్ల వద్దకు పంపించారు. నాపై ఆరోపణలకు ఎందుకు ఆధారాలు చూపలేకపోతున్నారు. చేతనైతే వాటిపై చర్యలు తీసుకోండి" అని సవాల్ విసిరారు. "తిరుపతి లడ్డూలో పందికొవ్వు కలిపారని సీఎం, డిప్యూటీ సీఎం ప్రచారం చేశారు. ఈ రోజు లడ్డూలో అలాంటిదేమీ లేదని తేలింది. తాము ఒకటి చేయాలనుకుంటే మరొకటి జరిగిందని కూటమి నేతలు బాధపడుతున్నారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేసేవాడు హిందూమతాన్ని కాపాడతాడా? నకిలీ మద్యం విషయంలో తప్పుడు ఆధారాలతో బురదజల్లారు. దీనిపై లీగల్‌గా ఫైట్ చేస్తాం. మమ్మల్ని ఇబ్బంది పెట్టినవారిని ఎవరినీ వదలం" అని హెచ్చరించారు.

### టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో

# కూర్చున్న చంద్రబాబు

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, తెలుగుదేశం పార్టీలో మాత్రం తాను ఒక సామాన్య కార్యకర్తనే అని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి చాటిచెప్పారు. అధికారిక హోదాలు, ప్రోటోకాల్ పక్కనపెట్టి, పార్టీ ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన కార్యకర్తల మధ్యలో కూర్చుని నాయకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన నిరాడంబరత అందరినీ ఆశ్చర్యపరిచింది, స్ఫూర్తినింపింది.

మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో 25 పార్లమెంట్ కమిటీల కోసం తెలుగుదేశం పార్టీ ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఒక్కో కమిటీ నుంచి 42 మంది చొప్పున మొత్తం 1,050 మంది సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ జరుగుతున్న వివిధ గదుల్లోకి స్వయంగా వెళ్లిన చంద్రబాబు, అక్కడి నాయకులు, కార్యకర్తల మధ్యలో కూర్చుని వారితో మమేకం అయ్యారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నూతన పార్లమెంట్ అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతిలోనూ ఆయన సాధారణ సభ్యుడిలా హాజరై, నేతలు చెప్పే విషయాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తమతో పాటు కూర్చోవడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు మొదట ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన చూపిన చొరవ, నిబద్ధత తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని నమ్ముతామని, దానికి అనుగుణంగానే తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగున్నర దశాబ్దాల ప్రయాణం, క్యాడర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్లాన్‌లపై కూడా సభ్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న నారా లోకేశ్ కూడా ప్రతి బృందం సభ్యులతోనూ ముచ్చటించారు. చంద్రబాబు తన హోదాను పక్కనపెట్టి సామాన్య కార్యకర్తగా ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ ఘటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.

పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

### పడిపోతున్న డాలర్..

# నిలకడగా రూపాయి

ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడు కులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీల తో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడు తుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. "బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చు" అని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. అయితే, సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.

### దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె...

# స్తంభించిన సేవలు

వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశంలోని దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని వడోదర, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సహా అనేక నగరాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఐదు రోజుల పని విధానం కోసం ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. "ఈరోజు సమ్మెలో దేశవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. 2015 నుంచి మా డిమాండ్ పెండింగ్‌లోనే ఉంది. ఎల్ఐసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోంది. బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు" అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పనిదినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని పాట్నాలో ఉద్యోగులు తెలిపారు. "ఆర్‌బీఐ, నాబార్డ్, సెబీ వంటి సంస్థలన్నీ 5 రోజులే పనిచేస్తున్నాయి. మాకు మాత్రం ఎందుకు అమలు చేయడం లేదు?" అని వారు ప్రశ్నించారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో దాదాపు 250 బ్యాంకులకు చెందిన 10,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో సుమారు రూ.150 కోట్ల విలువైన లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వ హామీ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

### ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

## షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ప్రజల సంక్షేమమే చింతమనేని లక్ష్యం

భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 25:
తెలుగుదేశం పార్టీ సంక్షేమం కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తూ ప్రజల సంక్షేమమే పరమావధిగా సేవలందిస్తున్న దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ను ఆదివారం భట్టిప్రోలు తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు. ఘనంగా ఎమ్మెల్యే ప్రభాకర్ నుసత్కరించారు. వినూత్న సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించే ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.స్వపక్షమైనా,విపక్షమైనా తాను చెప్పాలనుకున్న విషయాన్ని ఖచ్చితంగా చెప్పే స్వభావం చింతమనేని ప్రభాకర్ కు ఉండటం విశేష మన్నారు.ప్రజలు కష్టాల్లో ఉంటే వారిని ఆదుకోవడంలో ఎమ్మెల్యే ప్రభాకర్ చూపించే శ్రద్ధ ప్రశంసనీయమని భట్టిప్రోలు టిడిపి నాయకులు పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గం లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ను కలిసిన వారిలో భట్టిప్రోలు మండల పరిషత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ యడ్ల జయశీల రావు, కంభం సుధీర్,సువ్వ బాబురావు,కసుకుర్తి నెహ్రు,కంకణాల రాజేష్,గొట్టిపాటి మహేష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






## గొర్రెలు కలిశాయని గొడవ

### -: వ్యక్తిపై దాడి, కేసు నమోదు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 27 :
చిలకలూరిపేట : గొర్రెలు కాసే క్రమంలో రెండు మందలు ఒకదానికొకటి కలిశాయన్న చిన్న కారణంతో మొదలైన వివాదం ఒకరి ముక్కుపై బలమైన గాయానికి దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.పట్టణంలోని పురుషోత్తపట్నం నివాసి అలా సాంబశివరావు (47) మంగళవారం మధ్యాహ్నం 12:50 గంటల సమయంలో పసుమర్రు గ్రామ పరిధిలోని ఓగేరు వాగు సమీపంలో తన పొట్టేళ్లను మేపుకుంటున్నారు. అదే సమయంలో గుర్రాల చావిడికి చెందిన షేక్ అబ్దుల్లా తన గొర్రెలను తోలుకుంటూ అక్కడికి వచ్చాడు.రెండు మందలు ఒకదానికొకటి కలిసిపోతున్నాయని, గొర్రెలను కాస్త దూరంగా తోలుకోవాలని సాంబశివరావు సూచించారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి లోనైన అబ్దుల్లా తన చేతికి ఉన్న కడియంతో సాంబశివరావు ముక్కుపై బలంగా గుద్దాడు. ఆసుపత్రిలో చికిత్స:ఈ దాడిలో సాంబశివరావుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితుడు చిలకలూరిపేట లోని ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో తిమ్మాపురం ఆలయానికి రూ.56.25 లక్షలు మంజూరు

### -మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన తిమ్మాపురం గ్రామస్తులు, నాయకులు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 27 :
యడ్లపాడు: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ ప్రత్యేక చొరవతో యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాచీన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం రూపురేఖలు మారనున్నాయి. గ్రామస్తులు గతంలో మంత్రి లోకేష్ దృష్టికి ఆలయ అభివృద్ధి అంశం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో తిమ్మాపురంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ముఖమండపం, ఆలయ అభివృద్ధి పనులు కోసం దేవాదాయ శాఖ మొత్తం అంచనా వ్యయం 62 లక్షల 50 వేల రూపాయలు కాగా, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ 6,25,000, సిజిఎఫ్ నుంచి 56 లక్షల 25వేల రూపాయలు మంజూరు చేయడమైనది. దేవాలయం అభివృద్ధి కోసం అడిగిన వెంటనే దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించడం పట్ల గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఆలోచనలను గౌరవిస్తూ, దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం అభినందనీయమని, ఈ నిధులతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరిచి, భక్తులకు, గ్రామ ప్రజలకు అవసరమైన మరింత సౌకర్యాలు కల్పించే అవకాశం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటును అందిస్తున్నమంత్రి నారా లోకేష్‌కు రుణపడి ఉంటామన్నారు.

# దళితులపై దాడులను అరికట్టాలి

### ఎస్ సి సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల జనవరి :-- 27
పల్నాడు జిల్లా మాచర్ల వై యస్ అర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా వై యస్ అర్ కాంగ్రెస్ పార్టీ యస్ సి సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్ర శేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితలులపై దాడులు ఎక్కువ అయ్యాయని,మొన్న ఆదోనిలో గోవిందమ్మా, అద్దంకిలో చింతల శ్రీను, నిన్న పిన్నెల్లిలొ మంద సాల్మన్, నేడు నంద్యాల దగ్గరకు దళిత మహిళా పై అత్యాచారం ఈ విధంగా ప్రతి రోజు దళితులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో ప్రతినిత్యం రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో దళితుల సాంఘిక బహిస్కరణాలు జరుగుతున్నాయని అన్నారు. దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు ఎక్కువైనయని అన్నారు. దళితులు మొదటి నుండి వై సి పి కి అనుకూలంగా ఉంటారని కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వెదిస్తుందని అన్నారు. రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి దళితురాళాయి ఉండి దళితులపై జరుగుతున్న దాడులని అరికట్టలేకపోతున్నారని, ఇకనైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరుచుకొని దళితులపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టాలని, లేకపోతే పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో పోరాటం చేస్తామని అన్నారు.ఈ కార్యాక్రమంలో రాష్ట్ర యస్ సి సెల్ సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందర్రావు, మాచర్ల కౌన్సిలర్లు మంద సంతోష్, వేల్పుల గురవయ్య, నియోజకవర్గ యస్ సి సెల్ అధ్యక్షులు కందుకూరి మధు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాచర్ల పవన్,కొమ్ము బొంగురు, కోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## కారు ఢీకొని దంపతులకు గాయాలు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 27 :
నాదెండ్ల : మండలంలోని గణపవరం సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచార ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన పాలపర్తి కోటేశ్వరరావు (68), ఆయన భార్య దానమ్మ (65) టీవీఎస్ ఎక్సెల్‌పై గణపవరం నుండి రాజుపాలెం వెళ్తుండగా గణపవరం బ్రిడ్జి దాటి భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా చేరుకోగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు వారిని అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కారు ఆపకుండా అక్కడి నుంచే పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధ దంపతులకు అక్కడి స్థానికులు 108 అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చారు. స్పందించిన చిలకలూరిపేట 108 సిబ్బంది (ఈఎంటి శోభన్ బాబు) సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# నరసరావుపేట పట్టణంలో జామియా మసీదు కాంప్లెక్స్ పనుల పరిశీలన

### -వేగంగా పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 27: నరసరావుపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న జామియా మసీదు కాంప్లెక్స్ పనులను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్ నిర్మాణం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని పేర్కొన్న ఎమ్మెల్యే, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మికంతో పాటు సామాజిక అవసరాలకు కూడా ఈ కాంప్లెక్స్ దోహదపడుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు



# యువగళం మూడేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసిన.. ఎమ్మెల్యే నసీర్..

బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 27.
యువ నాయకులు, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ దిశదశను మార్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. నారా లోకేష్ పాదయాత్ర మూడేళ్లు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మూడేళ్ల ప్రస్థానంలో మంత్రి లోకేష్ కేవలం ఒక పార్టీ నాయకుడిగానే కాకుండా, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకున్న ప్రజా నాయకుడిగా ఎదిగారని తెలిపారు. పాదయాత్రలో ఆయన విన్న కష్టాలు, చూసిన కన్నీళ్లు నేడు మంత్రిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాల్లో ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. యువగళం ఒక పాదయాత్ర మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచి అని పేర్కొన్నరు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోన్న నిబద్ధత గల నాయకుడు నారా లోకేష్ అని కొనియాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కోసం సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి మత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పాటుపడుతున్నారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర 2024 ఎన్నికల్లో కూటమి విజయానికి బలమైన పునాది వేసిందన్నారు. యువతలో చైతన్యం తీసుకురావడంలోనూ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ఉత్తేజపరచడంలోనూ ఈ యాత్ర కీలక పాత్ర పోషించిందని చెప్పారు.





## వడ్డేశ్వరం గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ వార్షికోత్సవం...

### -జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా..

బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 27.
అనంతరం జరిగిన సమావేశంలో పాల్గొని చైర్పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యా వ్యవస్థలు సమూలన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు, కార్పొరేట్ విద్య సంస్థలకు దీపిక రాష్ట్రంలో విద్య వ్యవస్థను రూపొందించాలని కొనియాడారు.
ఆయన విద్యాశాఖ మంత్రిగా రాష్ట్రానికి లభించటం రాష్ట్ర ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ విద్యా జ్యోతి పుస్తకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ పుస్తకం వల్ల గతంలో వచ్చిన ప్రయోజనాల గురించి వివరించారు త్వరలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతను సాధించాలని ఆకాంక్షించారు విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కొన్ని సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటిని త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.విద్యా కమిటీ చైర్మన్ ఎస్.కె. బషీర్, టీడీపీ నాయకులు కోటయ్య, కరిమున్నిసా, సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు , మహిళ కార్యదర్శి మస్తాన్ బీ, హిమాంసా, నిమ్మకాయల మస్తాన్, ౦ఎ జానీ మొదలగు వారు పాల్గొన్నారు.

## రెవిన్యూ అంశాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి..

### .జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా,..

బపెన్ పవర్,గుంటూరు, జనవరి 27 : రెవిన్యూ అంశాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఐ.వి.ఆర్.ఎస్, మ్యుటేషన్, రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ తదితర అంశాలపై మంగళవారం జిల్లా కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఆర్.ఎస్ తదితర పద్దతులు ద్వారా ప్రజా స్పందనను ప్రభుత్వం తీసుకోవడం జరుగుతుందని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కారం చేసినపుడు మాత్రమే ప్రజల నమ్మకం పెరుగుతుందన్నారు. మ్యుటేషన్ వంటి అంశాలను త్వరగా పరిష్కారం చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.





# నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ప్రజల వద్ద నుండి స్వయంగా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 27: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజలు



ఎదుర్కొంటున్న సమస్యలు త్రాగునీరు, రహదారులు, పింఛన్లు, నివాస సమస్యలు, విద్యుత్, రెవెన్యూ సంబంధిత అంశాలపై వివరాలను తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సంబంధిత శాఖల అధికారులను వెంటనే స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు

# దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల జనరల్ స్ట్రైక్ కు సిఐటియు మద్దతు

**-బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం విధానం మార్చుకోవాలి....**

**-సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర....**

పత్తికొండ పెన్ పవర్,
పత్తికొండ:దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగులు 2023లో జరిగిన ఒప్పందం మేరకు ఐదు రోజుల పని విధానాలు పెట్టాలని కోరుతూ పత్తికొండ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ (ఎస్ బి ఐ) దగ్గర జరుగుతున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర, మద్దతు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని దేశవ్యాప్తంగా ఆల్ బ్యాంక్స్ ఉద్యోగుల కు ఐదు రోజులు పని విధానం వెంటనే కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ఐదు రోజులు పని విధానాన్ని వెంటనే అమలు పరచాలని ఫైనాన్స్ కమిషనర్ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో జాప్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలు చేపట్టి డిమాండ్లను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం విశ్వవిద్యాలయమైతే.. పార్టీ సిద్ధాంతాలు, చరిత్ర తిరుగులేని రాజకీయ సిలబస్ : ప్రత్తిపాటి

**ప్రత్తిపాటి శిక్షణావిధానాన్ని, సామాన్య కార్యకర్తలా పార్టీ శ్రేణులతో కలిసి కూర్చొని గమనించిన టీడీపీ అధినేత,ముఖ్యమంత్రి చంద్రబాబు**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 27 :
చిలకలూరిపేట : స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ రాజకీయరంగంలో తిరుగులేని విశ్వవిద్యాలయమని, ఆ మహనీయుడు నిర్దేశించిన పార్టీ సూత్రాలు, సిద్ధాంతాలు, చరిత్ర తిరుగులేని గొప్ప రాజకీయ సిలబస్ అని మాజీమంత్రి, సీనియర్ నాయకులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీల శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించిన వర్క్ షాప్ లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. పార్లమెంటరీ ఉపాధ్యక్షుల యొక్క విధులు-బాధ్యతలు, పార్టీ బలోపేతం, సుస్థిరతకు వారు తీసుకోవాల్సిన చర్యలు, అనుబంధ



సంఘాల బలోపేతం అంశాలపై పార్టీ పార్లమెంటరీ కమిటీల ఉపాధ్యక్షులకు నిర్వహించిన తరగతుల్లో ఆయన పార్టీ శ్రేణులకు పలు కీలక సూచనలు అందచేసి, వారితో తన అనుభవం, ఆలోచనలు పంచుకున్నారు.

దేశంలో మరే ప్రాంతీయ పార్టీకి లేని గుర్తింపు, మనుగడ టీడీపీకే సొంతమని, ఒకప్రాంతీయ పార్టీ దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగడం సామాన్య విషయం కాదని ప్రత్తిపాటి నూతనకమిటీ సభ్యులకు సూచించారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చినా, రాష్ట్ర ప్రయోజనాలు.. తెలుగు ప్రజల శ్రేయస్సు, సంక్షేమానికే టీడీపీ అధికప్రాధాన్యత ఇచ్చిందన్నారు. పార్టీ కేడర్ ప్రజల తలలో నాలుకలా ఉండాలని, ప్రజలకు టీడీపీ అంటే ఎనలేని గౌరవం, అభిమానం ఉంటాయని, క్రమశిక్షణ, నైతికత, నిబద్ధతతో ప్రతి కార్యకర్త వ్యవహరిస్తారని, వాస్తవాలను గుర్తించి క్షేత్రస్థాయిలో నూతన కమిటీలు మసలుకోవాలని ప్రత్తిపాటి తెలిపారు

# మొక్కజొన్న రైతులకు తక్షణమే సాగరు జలాలు విడుదల చేయాలి

## -జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సిన్హాను కోరిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 27: నరసరావుపేట నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులకు తక్షణమే సాగర్ జలాలను విడుదల చేయాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా ను మంగళవారం వారి కార్యాలయం లో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని రైతులు అధికంగా మొక్కజొన్న పంటను సాగు చేశారని, ఇప్పటికే ఒక్కో ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారని అయన తెలిపారు. ప్రస్తుతం సరైన నీటి సరఫరా లేకపోతే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని మరో 15 రోజుల పాటు నిర్విరామంగా సాగర్ జలాలు విడుదల చేసేలా సంబంధిత ఇరిగేషన్ అధికారులకు తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. నీటి కొరత వల్ల పంటలు ఎండిపోతే రైతులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురవుతారని, ప్రభుత్వ పరంగా వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.
రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యతగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కోరారు.
అంట్రకాకుండా కోటప్పకొండ లో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణి చేయాలన్నారు ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో గడచిన 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎస్సీలకు నివేసిన పట్టాలు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా



ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. వారు కోటప్పకొండ క్షేత్రంలో నిత్యం పారిశుధ్య పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని కోటప్పకొండలో పారిశుధ్యం మెరుగుపరచటంలో వారి కృషి ఎనలేనిదని వారికి నివేశన పట్టాలు మంజూరు చేస్తే ప్రభుత్వం నుండి వారికి పక్కా ఇల్లు నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సిన్హాను కోరారు.

# ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిని కల్పించటానికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి....



పెన్ పవర్, గుంటూరు, జనవరి, 27.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిని కల్పించటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.
అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, ప్రతి నెల మొదటి మంగళవారం మరియు చివరి మంగళవారం మహిళా గ్రీవెన్స్‌తో పాటు హెల్త్ క్యాంప్ కూడా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గత నాలుగు నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతూ, వచ్చిన సమస్యల్లో 8090 శాతం వరకు పరిష్కారం అందించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.
గ్రీవెన్స్‌లో చిట్టీ పాటల మోసాలు, గంజాయి వినియోగం, ఈవ్‌టీజింగ్, వీధి దీపాలు, కాంపౌండ్ వాల్ సమస్యలు వంటి పలు అంశాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా వికలాంగుల కాలనీలో చోటుచేసుకున్న ఘటనపై స్పందిస్తూ, ఈ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు.
ఉపాధి కల్పన, పెన్షన్లు, ఇళ్ల స్థలాలపై వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విధానాల ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోడ్లు, డ్రైన్ల సమస్యలపై పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ మహిళా గ్రీవెన్స్ కు



ట్రాన్స్‌జెండర్లను కూడా ఆహ్వానించి, వారి సమస్యలను తెలుసుకున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. చదువుకున్న ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆ దిశగా ఒక చదువుకున్న ట్రాన్స్‌జెండర్‌కు గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఉపాధి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రకటించారు. ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పించటానికి ఇతర సంస్థలు కూడా ముందుకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం

**-పార్టీ బలోపేతానికి పటిష్టమైన వ్యవస్థ అవసరం**

**(యువగళం ఏపీ రాజకీయాల్లో గేమ్‌చేంజర్**

**-తెదేపా పార్లమెంట్ కమిటీ శిక్షణా తరగతుల్లో ఎమ్మెల్యే ఏలూరి**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 28:
తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, క్రమశిక్షణతో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి ప్రాణమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కావాలంటే జిల్లా స్థాయి నుంచే పటిష్టమైన వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పార్టీకి ఒక సైన్యాధిపతి లాంటివాడని పేర్కొంటూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యే ఉండాలని, ప్రజల సమస్యలే మన అజెండాగా ఉండాలని పిలుపునిచ్చారు.
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల జీవన స్థితిగతులను గణనీయంగా మారుస్తున్నాయని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. గత ఐదేళ్ల అస్తవ్యస్త పాలన కారణంగా సరైన రహదారులు, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నాటి ప్రభుత్వాల తప్పిదాల వల్లే నేడు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆ సమస్యలను క్రమంగా పరిష్కరిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.
రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో అనుభవజ్ఞుడైన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడే రాష్ట్రానికి అవసరమని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ స్పష్టమైన దృష్టితో పాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే శక్తి ఆయన నాయకత్వానికే ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు.
మంత్రి నారా లోకేష్ పనితీరు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోందని తెలిపారు. యువ నాయకుడిగా ఆధునిక ఆలోచనలతో ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వరకు తీసుకెళ్లడంలో లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.
యువగళం పాదయాత్రకు నేటితో మూడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. యువగళం పాదయాత్ర ఏపీ రాజకీయాల్లో గేమ్‌చేంజర్‌గా నిలిచిందని పేర్కొంటూ, ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజాచైతన్యమే లక్ష్యంగా ఈ పాదయాత్ర సాగిందని గుర్తుచేశారు.
2023 జనవరి 27న కుప్పం నియోజకవర్గంలోని వరదరాజస్వామి సన్నిధిలో ప్రారంభమైన యువగళం పాదయాత్ర 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు కొనసాగిందని తెలిపారు.
సోషల్ మీడియా, ప్రత్యక్ష కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని సూచించిన ఎమ్మెల్యే, 2029 ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకొని ప్రతి బూత్‌ను బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహా పలువురు పార్టీ నేతలు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు



# జిఎంసి మెయిన్ ఆఫీస్ లో కమిషనర్ మయూర్ అశోక్ ఆకస్మిక తనిఖీ...



బపెన్ పవర్,గుంటూరు, జనవరి. 27 ఉదయం 11లకు కూడా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడం గమనించి, వారికి ఆఫ్ డే సెలవు మార్క్ చేయాలని మేనేజర్ కి ఆదేశం.

ఉద్యోగులు సకాలంలో హాజరుకాకుంటే కఠిన చర్యలు, మూవ్మెంట్ రిజిస్టర్ నిర్వహణ, విభాగాధిపతికి సమాచారం ఇవ్వాలి ప్రతి ఉద్యోగి టేబుల్ పై విధులు, పేరుతో బోర్డ్ లు ఏర్పాటు చేయాలి వినియోగించని వస్తువులను తొలగించాలి ప్రతి ఫైల్ ఆన్ లైన్ లోనే ఉండాలి ఇక నుండి ఆఫీస్ లోని సెక్షన్స్ ని ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని స్పష్టం చేసిన కమిషనర్...

# పెదపులివర్రు,సూరే పల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 27: మండల పరిధిలోని పెదపులివర్రు , సూరేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి మాట్లాడుతూ మొక్క జొన్న పంటలో ఆశించు పురుగులు, తెగుళ్ళను గురించి వివరించారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం కలుగజేసే కత్తెర పురుగు గురించి క్లుప్తంగా వివరించారు. కత్తెర పురుగు ను లార్వా దశలోనే గుర్తించడం ద్వారా దాని వల్ల కలిగే నష్టాన్ని నివారించ వచ్చన్నారు. లార్వా దశలో తల మీద తిరగబడిన వై ఆకారంలో మచ్చ ఉంటుందని దీని ద్వారా పొగాకు లద్దె పురుగు నుంచి దీన్ని వేరు చేసి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంట్రనిలిప్రోల్ 75 మి.లీ ఎకరాకు మరియు ఇమా మెక్టిన్ బెంజోయేట్ 100 గ్రా యకరాకు 140 లీటర్ల నీటికి కలుపుకుని పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)వారి ఆధ్వర్యంలో కత్తెర పురుగు జీవిత చరిత్ర, లక్షణాలు, నష్టనివారణ చర్యలు వంటి సమాచారం ఉన్న కరపత్రాలను రైతులకు అందించారు. అనంతరం మొక్కజొన్న క్షేత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి, ఏఈఓ లక్ష్మీ ప్రసన్న, వివిఎ నఫీసా మరియు రైతులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

## ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి-ఎస్.ఎఫ్.ఐ. పల్నాడు జిల్లా కమిటీ






నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 27: నరసరావుపేట పట్టణంలో ఉన్న ఆక్స్ఫర్డ్ విట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కూరకుల బాలకోటి రెడ్డి (18) అనే విద్యార్థి మంగళవారం కళాశాల వసతి గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం అత్యంత విషాదకరమైన ఘటనగా ఎస్.ఎఫ్.ఐ. పల్నాడు జిల్లా కమిటీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మృతుడు బాలకోటి రెడ్డి స్వగ్రామం పల్నాడు జిల్లా సంతమాగులూరు మండలం ఎల్చూరు గ్రామంగా గుర్తించారు. నాలుగు నెలల క్రితం బాలకోటి రెడ్డికి హెర్నియా శస్త్రచికిత్స జరిగిందని అతని తల్లి హైమావతి తెలిపారు. కళాశాలలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగానే తమ కుమారుడు మానసికంగా కుంగిపోయి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తల్లి హైమావతి ఆరోపించారు.

నరసరావుపేటలోని ప్రైవేట్ విద్యాసంస్థలు చదువు పేరుతో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, రోజుకు పదిహేను గంటలకు పైగా తరగతులు నిర్వహించి విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెంచుతున్నాయని ఎస్.ఎఫ్.ఐ. పల్నాడు జిల్లా కమిటీ విమర్శించింది. ఈ విషయాన్ని పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్లక్ష్య ధోరణే విద్యార్థి మృతి ఘటనకు కారణమై ఉండవచ్చని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కళాశాల యాజమాన్యాలు తగిన బాధ్యతతో వ్యవహరించాలని, అయితే ఈ ఘటనలో కళాశాల యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించింది.

ఈ విద్యార్థి మృతి ఘటనకు గల అసలు కారణాలను వెలికితీయడానికి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిటీని నియమించి, సమగ్ర విచారణ జరిపించాలని ఎస్.ఎఫ్.ఐ. పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అలాగే ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భద్రతను కాపాడే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

# గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో 78 గంటల మౌన దీక్ష - కొండిశెట్టి సురేష్ బాబు...

పెన్ పవర్, గుంటూరు:జనవరి, 27.
గ్రామీణ వైద్యుల ( ఆర్.ఎం.పి/పీఎంపీ) దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 78 గంటల మౌన దీక్ష చేపట్టనున్నట్లు గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొండిశెట్టి సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్య అంశాలు: ఎన్నికల హామీలు: 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని, శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికేట్లు ఇస్తామని హామీ ఇచ్చింది.

క్షేత్రస్థాయి కృషి: కూటమి గెలుపు కోసం గ్రామీణ వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా కృషి చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యల పరిష్కారంపై స్పష్టమైన చర్యలు లేకపోవడం విచారకరం.

ప్రభుత్వ స్పందన: సమస్యలపై చర్చించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ ఇప్పటి వరకు లభించలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్‌లకు వినతి పత్రాలు అందజేసినా స్పందన కరువైంది. చారిత్రక పాఠం: గత ప్రభుత్వాలు కూడా గ్రామీణ వైద్యుల సమస్యలను నిర్లక్ష్యం చేసి అధికారానికి దూరమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం ఆ తప్పు చేయకూడదని గుర్తు చేశారు.

దీక్ష వివరాలు:మౌన దీక్షకు సంబంధించి పోలీసు అనుమతులు వచ్చిన వెంటనే తేదీలను అధికారికంగా ప్రకటిస్తామని సురేష్ బాబు తెలిపారు. గ్రామీణ వైద్యుల వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే 2029 ఎన్నికల్లో దాని ప్రభావం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



# దుర్మార్గపు ప్రభుత్వాన్ని నిలదీసిన యువ గళం....

### టీడీపీ పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య..

బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 27.
దుర్మార్గపు ప్రభుత్వాన్ని నిలదీసిన యువ గళం యువగళం పాదయాత్రకి మూడేళ్లు( 27/01/23) మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనా హయంలో ఉపాధి అవకాశాలు లేక మెరుగైన జీవన ప్రమాణాలు అందుకోలేక తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయిన యువత..

కళ్ళ ముందు తమ బిడ్డల భవిష్యత్తు అగమ్యగోచ రంగా మారుస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలనా తీరు పట్ల తీవ్ర అసంతృప్తికి గురి అవుతున్న తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పించడమే లక్ష్యంగా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంకల్పించి పూర్తి చేసిన యువగళం పాదయాత్ర 2024 ఎన్నికల్లో కూటమి విజయానికి జగన్మోహన్ రెడ్డి పరాజయానికి ఒక గేమ్ చేంజర్ గా పని చేసింది అనేది నిర్వివాదాంశం. మాజీ ముఖ్యమంత్రి
జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గో నశీ.1 పేరిట కల్పిస్తున్న ఆంక్షలు అవరోధాలు నిర్బంధాలను అధిగమిస్తూ. 2014-19 మధ్య కాలంలో తాము తెచ్చిన పెట్టుబడులు నెలకొల్పబడ్డ సంస్థలు కల్పించబడిన ఉద్యోగాలు గురించి వివరించి చెప్తూ..

సమాజంలో వివిధ వర్గాల ప్రజలు వివిధ ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులు పరిశీలిస్తూ. ప్రజలకు తాను చేరువ అవుతూ ప్రజలను తనకు చేరువ చేసుకుంటూ. ముఖ్యంగా యువతకు మనోధైర్యం కల్పించడమే లక్ష్యంగా వారికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత 2024-29 మధ్య కాలంలో ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన చేస్తాము అని తాను ఇచ్చిన వాగ్దానం యధావిధిగా ఎన్ డి ఏ. కూటమి మేనిఫెస్టో లో కూడా పొందుపరచడం వల్ల 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలుపుకు కీలకంగా దోహదం చేసి అతని పాలనా కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయిన నిరుద్యోగ యువత 2024 ఎన్నికలో ఎన్ డి ఏ. కూటమి వైపు మొగ్గు చూపారు. అలా అతి ప్రధాన వర్గాన్ని తమ వైపు మరల్చడం యువగళం పాదయాత్ర ద్వారా లోకేష్ బాబు సాధించిన అతి పెద్ద విజయం. ఆనాటి యువగళం పాదయాత్ర హామీ నెరవేర్చుకుంటూ తొలిగా తన శాఖ నుంచే మెగా డిస్సీ నిర్వహణ ద్వారా 15,900 మంది ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ముగించారు.

అలాగే ఈ 18 నెలల 15 రోజుల పాలనలో ఇప్పటికే సుమారు 20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు చేసుకుని ఇప్పటికే సిబప్, కేబినెట్ ద్వారా 8.75 లక్షల కోట్ల ప్రతిపాదనలు క్లియర్ చేసి మిగిలిన ఒప్పందాలు కూడా సత్వరం గ్రౌండింగ్ అయ్యేలా కృషి చేస్తూ లక్షలాది ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రయత్నం చేస్తున్నారు ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు అలాగే నిన్న లోక్ భవన్ లో గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన ఏ ట్ హోమ్ కార్యక్రమంలో కౌన్సిల్ ప్రధాన ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ తో జరిగిన ఈ ఆత్మీయ పలకరింపు చూస్తూనే జగన్మోహన్ రెడ్డి పాలనా హయంలో రాష్ట్రంలో ఏమి కొరవడింది నేడు ఏమి మెయింటేన్ చేయబడుతుంది, అని అర్థం అవుతుంది.

యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మార్చడమే కాదు, చంద్రబాబు నాయుడు కొడుకుని అసలు సిసలు నాయకుడు గా తీర్చిదిద్దింది.

శుభ అభినందనలు తెలుపుతూ పజల ఆశీస్సులు ఐటీ మంత్రి లోకేష్
బాబు కి ఉండాలని కోరుకుంటూనా జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు, 'జన్ నాయక్' కర్పూరీ ఠాకూర్.

## - నాయీ బ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో ఘనంగా కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలు.

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 28
సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి, కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీ యుడు, 'జన్ నాయక్' కర్పూరీ ఠాకూర్ అని ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్ బాబు, విష్ణుకుమార్ సెన్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ పేర్కొన్నారు. కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగా స్థానిక అమరావతి రోడ్డులో నాయి బ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో 102 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్ బాబు, బెంగళూరుకు చెందిన ప్రముఖ విద్యావేత్త విష్ణుకుమార్ సెన్, ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తూ సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన కులానికి చెందినవారు అయినప్పటికీ ఎన్నో ఆటంకాలను అధిగమించి, అకుంఠిత దీక్షతో శ్రమించి, సమాజాభివృద్ధికి పాటుపడ్డారు అని అన్నారు. కర్పూరీ ఠాకూర్ జీవితం సరళత, సామాజిక న్యాయం అనే జంట స్తంభాల చుట్టూ తిరిగింది అని తన చివరి శ్వాస వరకు, ఆయన సాధారణ జీవనశైలి, వినయపూర్వకమైన స్వభావం సామాన్య ప్రజల హృదయాల్లో లోతుగా ప్రతిధ్వనించాయి అని తెలిపారు. కర్పూరీ ఠాకూర్ సామాజిక న్యాయం కోపం పరితపించారు ఆయన రాజకీయ ప్రయాణంలో వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరూ వారి సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అవకాశాలను పొందాలని భారత సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి పట్టుదలతో కృషి చేశారు అని అటువంటి మహనీయుని ఆశయాలను ఆలోచనా విధానాలను ముందుకు తీసుకు వెళుతూ ఆయన యొక్క జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ నంద యువసేన రాష్ట్ర అధ్యక్షులు బాబ్జినంద మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి "జననయక్ కర్పూరీ ఠాకూర్ స్మారక పురస్కారం" అందించడం జరుగుతుందని ఈ సంవత్సరం ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్ బాబుకు కర్పూరీ ఠాకూర్ స్మారక అవార్డు అందించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి తోడ్పాటున అందించేలా హెయిర్ సెలూన్ సెంటర్ నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు చట్టసభల్లో స్థానం కల్పిస్తామన్న హామీని ఇచ్చి అనేక పార్టీలు మోసం చేశాయని భవిష్యత్తులో అటువంటి అబద్ధపు హామీలకు స్వస్తి పలికేలా నాయి బ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించిన రాజకీయ పార్టీలకే పూర్తిస్థాయి మద్దతు అందించాలి అనే ఆలోచనతోనే ఐక్యతతో నాయి బ్రాహ్మణులు రాజ్యాధికార సాధనకై కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడివలస దేవరాజు, రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# ఏపీ రాష్ట్రంలో బిసి రుణాలను మంజూరు చేయడంలో నిర్లక్ష్యం తగదని

## -బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27:
పేర్కొన్నారు. పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం భవనంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు పెద్దపీటం వేస్తామన్న కూటమి ప్రభుత్వం ఆచరణలో పెట్టాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారం పై చిత్తశుద్ధిగా ఉన్నామన్న మాటలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోమన్నారు. బీసీ రుణాలు మంజూరు చేస్తున్నామని గత సంవత్సరం ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఏ ఒక్కరికి వారి ఖాతాలో రాయితీ రుణాల మొత్తం వేయడంలో విఫలమైందన్నారు. తక్షణమే ఆ రుణాలను మంజూరు చేయాలన్నారు. బీసీ మహిళలను చేతి వృత్తిదారులుగా అభివృద్ధి చేయడానికి శిక్షణ తరగతులను నిర్వహించడం అభినదనీయమన్నారు. అయితే వారికి ఇస్తామన్న కుట్టుమిషన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఆదరణ ఫేస్ త్రీ రుణాలను త్వరితగతిన మంజూరు చేసి లబ్ధిదారులకు ఆయా పరికరాలు అందజేయాలన్నారు. 26 జిల్లా కేంద్రాల్లో పూలే భవనాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. దమాషా లెక్కల ప్రకారం బీసీలకు కల్పిస్తానన్న రిజర్వేషన్ అమలులో కచ్చితంగా చేసే దానిపై స్పష్టత ప్రకటించాలన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను నియమిస్తున్నామన్నారు. త్వరలోనే బాపట్లలో రాష్ట్రస్థాయి బీసీ గర్జన నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఇంకోలు, పాములు వద్ద బీసీలపై జరిగిన దాడులను ఖండించారు. బీసీ రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జీవీఎల్ మోహన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా నాయకులు చేజర్ల సతీష్, మారం రవికుమార్, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, కంకణాల రాంబాబు, గవిని కృష్ణ తదితరులు పాల్గొన్నారు



# ఎడ్లపాడు పీహెచ్‌సీ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్వో డా. బి.రవి

### కొండవీడు ఫెస్ట్‌కు మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలన్న డీఎంహెచ్వో ఆదేశాలు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 27 :
ఎడ్లపాడు: పల్నాడు జిల్లా డీఎంహెచ్వో డాక్టర్ బి.రవి మంగళవారం ఎడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీలో అందుతున్న వైద్య సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ వినియోగంపై విచారించారు. ఇన్‌పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది రోజువారీ హాజరు వివరాలు పరిశీలించారు. గర్భిణీ స్త్రీల ఆమోదు తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీలోనే కాన్పులు ఎక్కువగా జరిగేలా చూడాలని డా.రవి సూచించారు. ప్రతి గర్భిణీకి ఆభా ఐడీలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ పురోగతిని కూడా పరిశీలించిన డీఎంహెచ్వో, సిబ్బందికి అప్పగించిన లక్ష్యాలు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరగనున్న కొండవీడు ఫెస్ట్‌కు అవసరమైన మెడికల్ క్యాంపులు, సిబ్బంది, మందుల ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు

# అగ్ని ప్రమాదస్తులకు రెడ్ క్రాస్ ఆదరణ.

### ఆరోగ్యంవంతమైన సమాజానికి అందరు కృషి చేయాలి. ఇన కొల్లు పోలీసు రావు .

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27
అగ్ని ప్రమాదస్తులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్లపాలెం కొంత ఆదరణ కలిగించినది. వారికి వంటసామాగ్రి ,అందించారు.సోమవారం మండలం లో నల్లమోతురుపాలెం లో జరిగిన అగ్ని ప్రమాదస్తులకు సాయన నరసింహారావు కుటుంబానికి కర్లపాలెం రెడ్ క్రాస్ సొసైటీ వారు చేయూతనిచ్చారు . రెడ్ క్రాస్ తరఫునుంచి వంట సామాగ్రి కిట్టును, బొంత సామ్యూల్ త్యాగరాజ్ సహకారంతో దుస్తులను , నిత్యవసర సరుకులు కందిపప్పు, చింతపండు, సబ్బులు, కొబ్బరి నూనె, కూరగాయలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారుఈ సందర్భంగా కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వము తో పాటు ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆయన కోరారు. ఈ సహాయాన్ని బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి నారాయణ బట్టు సలహా పై అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్



మందపాటి పరమానంద కుమార్, కోశాధికారి బుర్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు1 డిపోలో సమస్యలు నెలల తరబడి పేరుకుపోతున్నాయి.



పెన్ పవర్, గుంటూరు, జనవరి, 27.
డిపోలోని మౌలిక సమస్యలపై పలుమార్లు మెమొరాండాలు సమర్పించినప్పటికీ, ఈరోజు వరకు ఒక్క సమస్యకైనా పరిష్కారం జరగలేదు. ఉద్యోగుల ఆవేదనను, బాధలను పట్టించుకోకుండా గుంటూరు1 డిపో యాజమాన్యం మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారు. మెమొరాండాలను లెక్కచేయకుండా, సమస్యలను పక్కన పెట్టడం దారుణం. దీని ఫలితంగా ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతోంది. డిపో యాజమాన్యం నిర్లక్ష్య పాలనకు వ్యతిరేకంగా 27 నుంచి ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, 1డిపో యాజమాన్యంపై వైఖరిపై చర్యలు తీసుకుని, సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గుంటూరు వన్ డిపో ఉద్యోగులు..

# ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 27: ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సభా నేత, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు. మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో చర్చించబోయే ముఖ్య అంశాలను ఈ సందర్భంగా అయన వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం ఇతర దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై పార్లమెంటులో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అవసరమైతే దీనిపై ప్రత్యేక చర్చ నిర్వహించాలన్నారు. పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్న సామాజిక మాధ్యమాలపై నియంత్రణ అవసరమని అయన పేర్కొన్నారు. ముఖ్యంగా పదహారు సంవత్సరాల లోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నిషేధించే అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని తెలిపారు. అలాగే నూట ముప్పైవ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ముప్పై రోజులకు మించి జైల్లో ఉన్నవారు, ఐదు సంవత్సరాలకు మించి కేసులు ఎదుర్కొంటున్న వారు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రి వంటి పదవుల్లో కొనసాగకుండా తప్పుకోవాలనే అంశంపై చర్చ జరగాలని అన్నారు. అభియోగ పత్రం దాఖలైన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడంతో పాటు, ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా నిర్ణీత కాల పరిమితిలో కేసుల విచారణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్న అంశాన్ని కూడా లేవనెత్తనున్నట్లు అయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ముఖ్య అంశాలు:
2014 నుండి 2019 మధ్య మూడు రాజధానుల పేరుతో ఏర్పడిన గందరగోళాన్ని తొలగిస్తూ, అమరావతిని రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేస్తూ చర్చ జరపనున్నట్లు అయన తెలిపారు.

ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పూర్వోదయ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలనే అంశంపై చర్చించాలని అన్నారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. జల జీవన పథకం ద్వారా రాష్ట్రానికి ఇరవై ఆరు వేల కోట్ల రూపాయలు నిధులు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ మొత్తాన్ని ప్రకటించినప్పటికీ, 2019 నుండి 2024 మధ్య కాలంలో కేవలం రెండు వేల కోట్ల రూపాయలు మాత్రమే వినియోగించారని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు సమకూర్చకపోవడం వల్ల మిగిలిన నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ నిధులను పునరుద్ధరించి రాష్ట్రానికి న్యాయం చేయాలని పార్లమెంటులో ప్రస్తావిస్తామని అన్నారు.




అలాగే పొగాకు రైతుల సమస్యలపై కూడా చర్చించాలని తెలిపారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించిన కేంద్ర సుంకాల సవరణ బిల్లురెండు వేల ఇరవై ఐదుపై నెలకొన్న అనిశ్చితిని తొలగిస్తూ, స్పష్టత ఇవ్వడం ద్వారా వ్యాపారులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేలా పార్లమెంటులో మాట్లాడనున్నట్లు లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు

# శనివారం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఎదుట బ్యాంకు ఉద్యోగులు ధర్నా

రేపల్లె పెన్ పవర్, పతినిధి 27 1:26
వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ బ్యాంకు ల ఉమ్మడి ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రేపల్లె లో బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు డిమాండ్లపై చీఫ్ లేబర్ కమిషనర్ తో ఈనెల 23న జరిపిన చర్చలు విఫలం కావడంతో బ్యాంక్ అధికారులు సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఖాతాదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు వరుసగా శని ఆది సోమ వారాలు వరుసగా సెలవులు కావడం మంగళవారం బ్యాంకు ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడంతో కార్యకలాపాలు నిలిచిపోవడంతో అన్ని వర్గాల ఖాతాదారులు చాలా ఇబ్బందులు పడ్డారు

# రైతే దేశానికి వెన్నుముక

## - కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి...

బపెన్ పవర్,గుంటూరు:జనవరి, 27. జిల్లా బీజేపీ కార్యాలయం వాజపేయి భవన్ లో గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తుళ్ళిమిల్లి శ్రీనివాస్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి విచ్చేసి నాయకులకు, కార్యకర్తలకు, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చిగురుపాటి కుమార స్వామి మాట్లాడుతూ..రైతే దేశానికి వెన్నెముక అని - రైతున్న సంక్షేమంగా ఉంటేనే - దేశ సంక్షేమం అని రైతులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుంది అని, రైతన్న కి సమస్యలు ఉంటే కిసాన్ మోర్చా నాయకులు సత్వరం స్పందించి పరిష్కారం చూపే విధంగా పని చేయాలని, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, బలోపేతం చేయడానికి గ్రామ స్థాయిలో గ్రామ కమిటీలు వేయాలని తెలియజేశారు. పార్టీని బలోపేతం చేయాలంటే గ్రామ కమిటీలు ద్వారానే బిజెపి పార్టీ బలోపేతం అవుతుందని తద్వారా పార్టీ అధికారంలో రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా నాయకులు, కార్యకర్తలు చురుకుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, రాష్ట్ర బీజేపీ అధికార ముఖ్య ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డ నాగరాజు, ఓ. బి. సి. మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, స్పైసెస్ బోర్డు మెంబర్ కొత్తూరి సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.గంగాధర్, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగించారు.


ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ, కే.నారాయణ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవ నాయుడు, విమలాదేవి, మేరీ సరోజిని, శివయ్య, కార్యాలయ కార్యదర్శి కుందూరు నాగేశ్వరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాధా మాధవి, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రామారావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు సాంబశివరావు మరియు మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సోషల్‌మీడియాను నిషేధించే బిల్లు ఆమోదం

**విజయవాడ, జనవరి 27, పెన్ పవర్:** 15 ఏళ్లలోపు చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించే బిల్లును ఫ్రెంచ్ చట్టసభ సభ్యులు ఆమోదించారు. దిగువ సభలో సోమవారం రాత్రి నుండి మంగళవారం తెల్లవారుజాము వరకు సుదీర్ఘంగా జరిగిన సెషన్‌లో 130 నుండి 21 ఓట్ల తేడాతో తీర్మానం ఆమోదం పొందింది. ఫ్రాన్స్ ఎగువ సభ అయిన సెనెట్ ఆమోదం కూడా పొందితే ఈ తీర్మానం చట్టంగా మారుతుంది. అధిక స్క్రీన్ సమయం నుండి చిన్నారులను రక్షించే చర్యగా అధ్యక్షుడు మాక్రాన్ ఈ చర్యను అభివర్ణించారు. దేశంలో చిన్నారులు మరియు టీనేజర్స్‌ను రక్షించడానికి వేసిన ఈ ఓటు ప్రధాన చర్యగా ఆయన ప్రశంసించారు. 2026 విద్యా సంవత్సరం ప్రారంభం నుండి చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. సెప్టెంబర్ 1 నుండి నిషేధం అమల్లోకి వచ్చేలా ఫిబ్రవరి మధ్య నాటికి సెనెట్ బిల్లును ఆమోదిస్తుందని ఆశిస్తున్నట్లు దిగువ సభలో మాక్రాన్ పార్టీ
రెనీయసెన్స్‌కి నాయకత్వం వహిస్తున్న మాజీ ప్రధాని గాబ్రియేల్ పేర్కొన్నారు. 16ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియా వినియోగించడంపై ఆస్ట్రేలియా ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో నిషేధం విధించిన సంగతి తెలిసిందే. చిన్నారుల సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం విధించిన రెండవ దేశంగా ఫ్రాన్స్ నిలవనుంది.





03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా

**విజయవాడ, జనవరి 27, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్
మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత
కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

# వెనిజులాపై అమెరికా పెత్తనం సాగేనా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక సర్వసత్తాక దేశం మీద దాడి చేసి ఆ దేశపు అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలనూ కాలరాసిన ట్రంప్ తాను వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడానని చెప్పుకుంటున్నాడు ! మదురో ఒక మాదకద్రవ్య ముఠాకు నాయకుడిగా ఉన్నట్టు, ఆ ముఠాను అరికట్టకపోతే అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లనున్నట్టు ప్రచారం చేస్తున్నాడు. కానీ వాస్తవానికి ప్రపంచంలో జరుగుతున్న కొకైన్ వ్యాపారంలో ఉన్న అంతర్జాతీయ ముఠా నెట్‌వర్క్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మెక్సికో, కొలంబియా, హొండురాస్, అర్జెంటినా, ఈక్వెడార్ వంటి దేశాల్లోనుండి పని చేస్తున్న మితవాద శక్తులు. ఈ శక్తులకు అమెరికా అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి. అందులో వెనిజులా దేశంలోని డ్రగ్ మాఫియా వాటా నామమాత్రమే. ఐనా, తక్కిన దేశాలను వదిలిపెట్టి వెనిజులా మీదనే పడ్డాడు ట్రంప్. ఈ దాడికి ప్రధాన కారణం వెనిజులాలో ఉన్న చమురు నిల్వల మీద పెత్తనాన్ని పొందాలని అమెరికా భావించడమే. వెనిజులాతో ప్రారంభించి మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిపైనా తన పెత్తనాన్ని చెలాయించాలని అమెరికా భావిస్తోంది. 1817-1825 మధ్య అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జేమ్స్ మన్రో ఆ కాలంలో ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దానినే మన్రో సిద్ధాంతం అని పిలుస్తారు. దాని ప్రకారం తన దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా సైనిక చర్యలతో సహా ఎటువంటి చర్యలకైనా పూనుకునే హక్కు అమెరికాకు ఉంది. చాలా దుర్మార్గమైన ఈ సిద్ధాంతానికి తర్వాత కాలం చెల్లింది. కాని ట్రంప్ శతాబ్దాలక్రితమే తిరస్కరించబడిన ఆ సిద్ధాంతాన్ని మళ్లీ ముందుకు తెచ్చాడు. ఇప్పుడు మన్రో సిద్ధాంతం కాస్తా 'డాన్రో' సిద్ధాంతంగా పేరు మార్చుకుంది. (ట్రంప్ పేరులోని మొదటి భాగం డొనాల్డ్‌లోని డాన్ ను, మన్రో పేరులోని ఒక భాగాన్ని కలిపి డాన్రో చేశారు) అమెరికాకనుకూలంగా తొత్తు మాదిరిగా వ్యవహరించే ప్రభుత్వాన్ని తొలగించి ఆ స్థానంలో చావెజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వెనిజులాలోని చమురు కంపెనీలను జాతీయం చేశాడు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయసాగాడు. దానికి ప్రతీకారంగా అమెరికా వెనిజులా మీద ఆంక్షలు ప్రకటించింది. విదేశాల్లో ఉన్న వెనిజులా పెట్టుబడులను స్తంభింపజేసింది. దాంతో వెనిజులా తీవ్ర ఆర్థిక వత్తిడికి లోనైంది. ఆ పరిస్థితుల్లో వెనిజులా చైనా, రష్యా, ఇరాన్ దేశాలతో ఆర్థిక, సైనిక సంబంధాలను బలపరుచుకుంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలకు దగ్గరైంది. ఐనప్పటికీ అమెరికా ఆంక్షలు వెనిజులాను కుంగదీశాయి. గతంలో రోజుకు 3.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసిన పరిస్థితి నుండి ఆంక్షల తర్వాత అందులో మూడో వంతు కూడా ఉత్పత్తి చేయలేని స్థితి వచ్చింది. ఇదే అదనుగా భావించిన ట్రంప్ మదురో దంపతుల కిడ్నాప్‌కూ పూనుకున్నాడు. వారిని అడ్డం పెట్టుకుని వెనిజులాలోని చమురు కంపెనీల మీద మళ్లీ పెత్తనాన్ని పొందాలని భావిస్తున్నాడు. అందుకు వీలుగా వెనిజులాలో తన తొత్తుగా వ్యవహరించే మారియా కొరినా మచాడోను గద్దె మీద కూర్చోబెట్టదలిచాడు. కానీ వెనిజులాలోని ప్రజాభిప్రాయం అందుకు బాగా వ్యతిరేకంగా ఉంది. మదురోతోబాటు ఉపాధ్యక్షురాలిగా పని చేసిన డెల్సీ రోడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు ఇప్పుడు నిర్వహిస్తున్నారు, తామంతా మదురోతోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు అమెరికా ఎలా వ్యవహరించబోతోంది అన్నది చూడాలి. వెనిజులాలో చమురు నిల్వల మీద పట్టు ఒకవేళ అమెరికా సంపాదించినా, మళ్లీ అక్కడ చమురు ఉత్పత్తిని పాత స్థాయికి తీసుకురావాలంటే 18000 నుండి 20000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వెంటనే అవసరం. కాని అమెరికన్ చమురు కంపెనీల మొత్తం పెట్టుబడులే 41,300 కోట్ల డాలర్లు. అదీ గాక, ఒకసారి జాతీయం అయిన చమురు కంపెనీల నుండి తాము పొందుతున్న ప్రయోజనాలను చవిచూసిన వెనిజులా ప్రజలు తమ చమురు కంపెనీలను అమెరికాకు కట్టబెట్టడానికి అంగీకరించే పరిస్థితిలో లేరు. ఇంకో పక్క చైనా కూడా వెనిజులాలో భారీగానే పెట్టుబడులు పెట్టింది. మదురోను కిడ్నాప్ చేసిన వెంటనే చైనా, రష్యా వెనిజులాకు, మదురోకు తమ మద్దతు ప్రకటించాయి. అందుచేత వెనిజులా విషయంలో అమెరికాదే ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతుందని భావించలేం. కేవలం చమురు నిల్వల మీద పట్టు కోసమే అమెరికా ఇదంతా చేస్తోందని అనుకోలేం. దాని ప్రధాన లక్ష్యం తన ప్రపంచాధిపత్యాన్ని సవాలు చేస్తున్న చైనాను నిలువరించడం. చాలా లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఇప్పుడు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. లాటిన్ అమెరికాలోని 22 దేశాలు చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో చేరాయి. చైనా వెనిజులా నుంచి చమురు దిగుమతులను డాలర్లలో కాకుండా యువాన్లలో చేసుకుంటోంది. చాలా లాటిన్ అమెరికా దేశాల్లో మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెట్టింది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌తో పని లేకుండా వుండే విధంగా క్రాస్ బోర్డర్ ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సిస్టం పేరుతో ఆర్థిక లావాదేవీల వ్యవస్థను చైనా ప్రవేశపెట్టింది. ఈ ప్రయత్నాలన్నీ అంతిమంగా తన డాలర్ ఆధిపత్యానికి సవాలుగా మారుతాయని అమెరికా ఆందోళన చెందుతోంది. తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదం ఆచరణలో ముందుకు అడుగు వేయలేకపోతోందని ట్రంప్ గ్రహిస్తున్నాడు. మూడవ ప్రపంచ దేశాలనుండి
సరుకుల ఉత్పత్తి రంగాలు అమెరికాకు తరలిరావడానికి సిద్ధంగా లేవు. అమెరికాలో ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఏకధ్రువ ప్రపంచం అనే వాతావరణం ఇప్పుడు లేదు. డాలర్ ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగానే తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. సామ్రాజ్యవాద ఆధిపత్యం, దానికి మొనగాడి స్థానంలో ఉన్న అమెరికా పరిస్థితి పెను సవాళ్లనెదుర్కొంటున్నాయి. చేజారిపోతున్న తన ఆధిపత్యాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని అమెరికా ప్రయత్నిస్తున్నప్పటికీ, అందుకు ప్రతికూల దిశలో పనిచేస్తున్న శక్తులూ బలంగానే ఉన్నాయి. అమెరికా, సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యంతో గత 35 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ క్రమం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసింది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలంగా సవాలు చేస్తున్న శక్తులున్న ఈ తరుణంలో మూడవ ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారతదేశం తమ సార్వభౌమాధికారాన్ని తిరిగి బలంగా నిలబెట్టడానికి ఇదే మంచి తరుణం. కాని, మోడీ ప్రభుత్వం దురహంకారపూరిత సంకుచిత జాతీయవాదంతో వ్యవహరిస్తూ మరోపక్క అమెరికా అడుగులకు మడుగులొత్తుతోంది. దేశ విశాల ప్రయోజనాలు దీనివలన దెబ్బ తిన్నా తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. అందుచేత ప్రగతిశీల శక్తులమీద బాధ్యత ఎక్కువగా ఉంది. సామ్రాజ్యవాద వ్యతిరేకత బలంగా ప్రజానీకంలో నెలకొల్పడానికి దేశభక్తియుత శక్తులన్నీ ఐక్యంగా పాటుపడాల్సిన సమయం ఇది.

## అమరావతికి చట్టబద్ధత..



**అమరావతి, జనవరి 27, పెన్ పవర్:** అమరావతి రాజధాని కి చట్టబద్ధతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చట్టం చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశాలు కావడం.. టిడిపి తో పాటు కూటమి ఎంపీలకు కీలక సూచనలు చేయడం చూస్తుంటే మాత్రం బిల్లు పార్లమెంట్ లోకి వస్తుందని అర్థమవుతోంది. అయితే ఇప్పుడు ఆ 29 గ్రామాలను మాత్రమే కలిపి అమరావతిగా గుర్తిస్తారా? లేకుంటే పక్కన ఉన్న విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ గుర్తిస్తారా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే అమరావతి అంటే మున్సిపాలిటీ కాదు అని.. అదో మహానగరం గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం చట్టబద్ధత కల్పిస్తున్న దృష్ట్యా అమరావతిని మరింత విస్తృతపరచి గుర్తించాల్సిన అవసరం ఉంది. విజయవాడ తో పాటు గుంటూరు నగరాలను కలిపితేనే.. అమరావతి అనేది ఒక అద్భుతమైన నగరంగా ఆవిష్కృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. అందరి అభిప్రాయంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 50 వేల ఎకరాల వరకు సమీకరించి అమరావతి రాజధాని పనులను మొదలుపెట్టారు. ఇంతలోనే అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అమరావతి నిర్వీర్యం అయింది. గత ఐదేళ్లపాటు అమరావతి రైతులు పడరాని పాట్లు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి కూడా. అయితే ఇప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానిపై విషం కక్కుతూనే ఉంది. దీంతో అమరావతికి చట్టబద్ధత తెస్తే కానీ తమకు శాంతి ఉండదని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. అందుకే ఏపీ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది.అయితే కేవలం 29 పంచాయితీలను మాత్రమే అమరావతిగా గుర్తిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే అదనపు భూసేకరణ చేపడుతున్నారు. చెంతనే విజయవాడ ఉంది. ఆపై గుంటూరు నగరం కూడా ఉంది. కృష్ణా,గుంటూరు, ఎన్టీఆర్ తో పాటు పరిసర జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను అమరావతిలో చేర్చితే ఇదో మహానగరంగా, ప్రపంచ స్థాయి నగరంగా గుర్తించబడుతుంది. ఇప్పటికే అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రణాళిక. అందుకు తగ్గట్టు చంద్రబాబు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆ 29 పంచాయితీలకే అమరావతిని పరిమితం చేయడం ఎంత మాత్రం సుముఖత కాదు. అయితే అందుకే సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో సమన్వయం చేసుకుంటున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత విషయంలో సానుకూలతలకు ప్రయత్నిస్తున్నారు. విస్తృత సంప్రదింపులు జరపాలని పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. మొత్తానికైతే అమరావతి చట్టబద్ధత విషయంలో ఏం జరుగుతుంది అనే దానిపై అంతటా చర్చ నడుస్తోంది.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం

**విజయవాడ, జనవరి 27, పెన్ పవర్:**
టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కేంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే. అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది.. అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి .తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది. అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని



అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.

### గుంభనంగా క్యాడర్

చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్ లను కూడా లోకేశ్ కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్ లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉంటే జగన్ ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు. దీంతో స్థానిక శాసనసభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్స్‌డ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.

## వరల్డ్ కప్‌తో పాటు 500 పైగా వికెట్లు: క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ కేన్ రిచర్డ్సన్ ప్రొఫెషనల్ క్రికెట్ కు గుడ్ బై చెప్పాడు. మంగళవారం (జనవరి 27) ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిచర్డ్సన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు. 2009లో ఆస్ట్రేలియా జట్టులో అరంగేట్రం

చేసిన ఈ ఆసీస్ పేసర్ 17 ఏళ్ళ తర్వాత తన క్రికెట్ కెరీర్ కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియా జట్టుతో పాటు బిగ్ బాష్ లీగ్ లో రిచర్డ్సన్ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా టీ20 క్రికెట్ లో ఈ ఆసీస్ పేసర్ తన మార్క్ చూపించాడు. చివరిసారిగా 2023లో ఆస్ట్రేలియా జట్టు తరపున ఆడిన రిచర్డ్సన్..ఈ మూడేళ్ళలో జట్టులో స్థానం కోసం పోరాడినా ఫలితం లేకపోయింది. "ఈ బిగ్ బాష్ లీగ్ ఆడి నేను ప్రొఫెషనల్ క్రికెట్ నుండి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. 2009లో నా అరంగేట్రం నుండి ఇప్పటివరకు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. నా కెరీర్ ముగించడానికి ఇదే నాకు సరైన సమయం. నా కెరీర్‌ను తీర్చిదిద్దిన కోచ్‌లు, నిర్వాహకులు, తోటి ఆటగాళ్లకు ముఖ్యంగా సౌత్ ఆస్ట్రేలియాకు నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే అదృష్టం నాకు కలిగింది. ప్రపంచవ్యాప్తంగా అనేక ఫ్రాంచైజీ జట్లతో పాటు, ఆస్ట్రేలియాకు కూడా ప్రాతినిధ్యం వహించాను". అని రిచర్డ్సన్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాశాడు.

34 ఏళ్ల రిచర్డ్సన్ ఆస్ట్రేలియా తరపున 25 వన్డేలు, 36 టీ20 మ్యాచ్ ల్లో ఆడాడు. మొత్తం 84 అంతర్జాతీయ వికెట్లు పడగొట్టాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 102 వికెట్లు.. లిస్ట్ ఎ క్రికెట్‌లో 153 వికెట్లు.. టీ20ల్లో 241 వికెట్లు తన

ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియాలోని బిగ్ బాష్ లీగ్ లో రిచర్డ్సన్ వన్ ఆఫ్ ది బెస్ట్ బౌలర్ గా నిలిచాడు. 118 మ్యాచ్‌ల్లో 142 వికెట్లు తీసి టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో బౌలర్ గా తన కెరీర్ ముగించాడు. 2021 టీ20 వరల్డ్ కప్ ఆస్ట్రేలియా గెలుచుకున్నప్పుడు రిచర్డ్సన్ జట్టులో ఉన్నాడు.

# ఒత్తిడిలో అతడు టీమిండియాకు కీలక ప్లేయర్.. యంగ్ క్రికెటర్‌పై రోహిత్ ప్రశంసలు

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కు 10 రోజుల సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. దీనికి తోడు జట్టు సూర్య కెప్టెన్సీలోని టీమిండియా సూపర్ ఫామ్ లో ఉండడంతో అంచనాలు పెరిగిపోయాయి. జట్టు అత్యంత పటిష్టంగా ఉండడంతో పాటు గత రెండేళ్లలో తిరుగులేని విజయాలు సాధిస్తూ ముందుకు వెళ్తుంది.ఇండియాలో మ్యాచ్ విన్నర్లకు కొదువ లేదు. ఎవరికీ వారే తమదైన రోజున మ్యాచ్ ను టర్న్ చేయగలరు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్ భారీ ఇన్నింగ్స్ లు ఆడగలరు. సూర్య ఎలాంటి ఆటగాడో ఇప్పటికే నిరూపించుకున్నాడు. స్వదేశంలో తిప్పేయడానికి స్పిన్నర్లు సై అంటున్నారు. పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా సూపర్ ఫామ్ లో ఉన్నారు. ఆల్ రౌండర్లు అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే నిలకడగా రాణిస్తున్నారు. భారత జట్టులో ఎంతమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నప్పటికీ వరల్డ్ కప్ ముందు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఒక బిగ్ మ్యాచ్ ప్లేయర్ ను సూచించాడు. రోడ్‌మ్యాప్'లో జతిన్ సప్రుతో మాట్లాడుతూ రోహిత్ శర్మ ఇలా అన్నాడు.."అతని కెరీర్ ఇప్పుడే ప్రారంభమైందని నాకు తెలుసు. కానీ తిలక్ బిగ్ మ్యాచ్ ప్లేయర్. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చాలాసార్లు ఆదుకున్నాడు. మొదటసారి తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ సెటప్ లో అడుగుపెట్టినప్పుడు అతనిలో ఏదో ఉందని నేను గుర్తించాను. నాతో మాట్లాడినప్పుడల్లా తిలక్ తనకు ఛాన్స్ ఇవ్వమని.. బ్యాటింగ్ ఆర్డర్ లో ముందుకు పంపితే తాను నిరూపించుకుంటానని చెప్పేవాడు. క్రికెట్ అంటే అతనికి పిచ్చి. ముఖ్యంగా ఆసియా కప్ లో పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో అతని త నమ్మశక్యంగా లేదు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు ఒత్తిడి తట్టుకొని రాణించడం చాలా కష్టం". అని



తిలక్ పై రోహిత్ ప్రశంసలు కురిపించాడు.

**ఫిట్ నెస్ సాధించని తిలక్ వర్మ:**

తిలక్ వర్మ విషయానికి వస్తే ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఇప్పటికే న్యూజిలాండ్ తో తొలి మూడు టీ20 మ్యాచ్ లకు దూరమైన తిలక్ వర్మ చివరి రెండు టీ20లకు అందుబాటులో ఉండడం లేదు. పొత్తి కడుపు సర్జరీ నుంచి కోలుకుంటున్న తిలక్ ప్లేస్‌లో శ్రేయస్ అయ్యర్‌ను బుధ, శనివారాల్లో జరిగే నాలుగో, ఐదో మ్యాచ్‌ల్లో కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ సోమవారం ప్రకటించింది. 'సర్జరీ తర్వాత తిలక్ ఫిజికల్ ట్రెయినింగ్ మొదలు పెట్టాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతని రిహాబిలిటేషన్ సంతృప్తిగానే ఉంది. కానీ, ఫుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు మరికొంత సమయం అవసరం. అందుకే న్యూజిలాండ్‌తో చివరి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. పూర్తి ఫిట్‌నెస్ అందుకున్న తర్వాత ఫిబ్రవరి 3న ముంబైలో టీ20 వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌కు ముందు ఇండియా జట్టులో కలుస్తాడు' అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

## మల్హోత్రా సూపర్ సెంచరీతో టీమిండియాకు భారీ స్కోర్.. జింబాబ్వే టార్గెట్ ఎంతంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ లో భాగంగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్ లో టీమిండియా బ్యాటింగ్ లో దుమ్మురేపింది. పసికూన జింబాబ్వే పై ప్రతాపం చూపిస్తూ భారీ స్కోర్ చేసింది. మంగళవారం (జనవరి 27) బులవాయో వేదికగా క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ లో జరిగిన మ్యాచ్ లో విహాన్ మల్హోత్రా సెంచరీ (109)తో పాటు అభిజ్ఞాన్ కుండు (61), వైభవ్ సూర్యవంశీ (52) హాఫ్ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. 109 పరుగులు చేసిన విహాన్ మల్హోత్రా టాప్ స్కోరర్ గా నిలిచాడు. జింబాబ్వే బౌలర్లలో టటెండా చిముగోరో మూడు వికెట్లు పడగొట్టాడు. సింబరాషే ముడ్జెంగెరెరే, పనాషే మజాయ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియాకు తుఫాన్ ఆరంభం లభించింది. ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ మెరుపులతో తొలి నాలుగు ఓవర్లలోనే ఒడియా 44 పరుగులు రాబట్టింది. ఉన్నంత సేపు వేగంగా ఆడిన ఆరోన్ జార్జ్ 23 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటయ్యాడు. అయితే సూర్యవంశీ మాత్రం మరో ఎండ్ లో తన విధ్వంసం ఆపలేదు. చూస్తుండగానే హాఫ్ సెంచరీ బాదేశాడు. రెండో వికెట్ కు మాత్రేతో కలిసి 56 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మాత్రతో పాటు సూర్యవంశీ (52) స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఇండియా 101 పరుగుల వద్ద మూడు వికెట్లు కోల్పోయింది.

వేదాంత్ త్రివేది (13) కూడా తక్కువ స్కోర్ కే ఔట్ కావడంతో ఇండియా 130 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. ఈ దశలో జట్టుకు ఆదుకునే బాధ్యత విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు తీసుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్ కు 123 పరుగులు జోడించి జట్టును భారీ స్కోర్ దిశగా నడిపారు. హాఫ్ సెంచరీ చేసి కుండు ఔటైనా ఆ తర్వాత మల్హోత్రా మాత్రం చివరి వరకు క్రీజ్ లో ఉండి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. చివర్లో ఖిలాన్ పటేల్ 12 బంతుల్లోనే 30 పరుగులు చేసి జట్టును 350 పరుగుల మార్క్ కు చేర్చాడు.



**దిశా పటానీ: ఎల్లే కవర్‌పై చంపు తోంది**

# రీజనల్ మార్కెట్ లో వీళ్లకు పోటీనే లేదా?





కమర్షియల్ చిత్రాలతో రీజనల్ మార్కెట్ ఫరిదిలో సినిమాలు చేసే దర్శకులు ఎంత మంది అంటే ? ప్రముఖంగా ముగ్గురు దర్శకులు హైలైట్ అవుతారు.కమర్షియల్ చిత్రాలతో రీజనల్ మార్కెట్ ఫరిదిలో సినిమాలు చేసే దర్శకులు ఎంత మంది అంటే ? ప్రముఖంగా ముగ్గురు దర్శకులు హైలైట్ అవుతారు. వాళ్లే త్రివిక్రమ్, అనీల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబి కొల్లి. వీళ్ల గాక హరీష్ శంకర్, పూరి జగన్నాధ్, సురేందర్ రెడ్డి, బోయపాటి శ్రీను లాంటి వారు ఉన్నా? వీళ్లంతా ఫెయిల్యూర్స్ లో ఉన్నారు. ప్రధానంగా ఫామ్ లో ఉంది మాత్రం పై నలుగురు దర్శకులే. కొంత కాలంగా టాలీవుడ్ లో వాళ్ల చిత్రాలకు తిరుగు లేదు. ఎలాంటి సినిమాలు చేసినా కమర్షియల్ గా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి.అనీల్ రావిపూడి ఇప్పటి వరకూ తొమ్మిది సినిమాలు చేసాడు. తొమ్మిది బ్లాక్ బస్టర్లు అయ్యాయి. అవేమి గొప్ప కథలు కాదు. ఎంటర్ టైనింగ్ గా ప్రేక్షకులకు కనెక్ట్ చేసి కాసుల వర్షం కురిపించాడు. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులకు చక్కని వినోదాన్ని అందించాడు. ఈ విషయంలో అనీల్ కూడా ఎంతో ఓపెన్ గా ఉంటాడు. తన సామర్థ్యం హాస్యం అని దాన్ని బేస్ చేసుకుని తన ఫరిదిలో ఎంటర్ టైన్ చేస్తానన్నాడు. అలాగే కంటున్యూ అవుతాడు. తానేదో గొప్ప సినిమాలు తీసానని ఏనాడు ప్రగల్బాలు పకలేదు. అనీల్ జమానా టాలీవుడ్ లో ఇంకొంత కాలం తిరుగుండదు.ఈ జానర్లో సినిమాలు చేసే దర్శకులు అనీల్ ఒక్కడే కనిపిస్తున్నాడు. డైరెక్టర్ బాబి ట్రాక్ రికార్డు కూడా బాగుంది. -పవర్- నుంచి -డాకు మహారాజ్- వరకూ కమర్షియల్ గా మంచి విజయాలు అందించాడు. -సర్దార్ గబ్బర్ సింగ్- తప్ప మిగతా సినిమాలన్నీ మంచి విజయం సాధించినవే. చిరంజీవి, బాలయ్య, వెంకటేష్ లాంటి సీనియర్లకు బాబి అంటే ఎనలేని నమ్మకం. వారందరితో పనిచేసి విజయాలు అందించి ఆ నమ్మకాన్ని ఏర్పరుచుకున్నాడు.మాస్ కంటెంట్ ని కొత్తగా ప్రజెంట్ చేసే ప్రయత్నం చేస్తాడు. అందుకే బాబి సక్సెస్ అయ్యాడు. తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ఏర్పడింది.మరో మాస్ మసాలా డైరెక్టర్ గోపీచంద్ మలినేని కూడా బాబిలా సక్సెస్ అయిన డైరెక్టరే. కమర్షియల్ గా ఇతడి సినిమాలు మంచి విజయాలు సాధిస్తాయి. బడ్జెట్ కూడా భారీగా ఉండదు. -జాట్- సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. నార్త్ లో సైతం దర్శకుడిగా మంచి గుర్తింపు తొలి సినిమాతోనే దక్కించుకున్నాడు. ఆ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచనలో కూడా మలినేని ఉన్నాడు. సీనియర్ హీరోలు గోపీచంద్ ని రిపీట్ చేస్తున్నారంటే? కారణం సక్సెస్ ఫార్ములా తెలిసిన దర్శకుడి కావడంతోనే సాధ్యమవుతుంది. వీళ్లందరికీ కాస్త భిన్నంగా త్రివిక్రమ్ విజయాలుంటాయి. బలమైన కథ గురూజీ సినిమాల్లో హైలైట్ అవుతుంది. ఆ పాత్రలను అంతే బలంగా చెబుతాడు. అదే ఈ మాస్టర్ ప్రత్యేకత. రీజనల్ మార్కెట్ ఫరిదిలో ఈ నలుగురుకి పోటీ లేనే లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com